కళాత్మకం


ఆధునికీకరించిన తరువాత ఆడిటోరియం(నేడు)


కళావిహీనంగా ఉన్న ఆడిటోరియం(నాడు)

దేశ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ఉంటాయి. విశ్వకళా పరిషత్ అనే పేరు కేవలం ఆంధ్ర విశ్వకళా పరిషత్‌కే సొంతం. పేరులోనే కళను కలిగిన ఏకైక విశ్వవిద్యాలయం ఏయూ. ఇంత ప్రాధాన్యత కలిగిన ఏయూ తన పేరును సార్థకం చేసుకుంటూ చిత్ర కళలు, నాటక రంగం, సంగీతం, నృత్యం నుంచి నేటి సినీ సంగీతం వరకు నిష్ణాతులను సమాజానికి అందించే బృహత్తర బాధ్యతను 98 సంవత్సరాలుగా నిర్విరామంగా నిర్వహిస్తోంది. దశాబ్దాల క్రితం కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఆరుబయలు రంగస్థలం దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నిరాదరణకు గురైంది. తాజాగా ఈ ఆడిటోరియను కళాత్మకంగా పూర్తిస్థాయిలో ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్ది ఇటీవల వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఏయూ క్యాంపస్


సప్తవర్ణ శోభితంగా దర్శనమిస్తున్న ఆడిటోరియం ప్రాంగణం

క్లుప్తంగా

ఆరోగ్య సంరక్షణలో 'సత్వ' కీలక పాత్ర


స్టాల్స్‌ను సందర్శిస్తున్న గవర్నర్ హరిబాబు

బీచ్ రోడ్డు: ఉత్తరాంధ్ర ప్రాంతవాసుల ఆరోగ్య సంరక్షణలో సత్వ నేచురల్ కీలక పాత్ర పోషిస్తుందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని పామ్ బీచ్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన నేచురల్ లివింగ్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులకు విశాఖలో మంచి ఆదరణ ఉందన్నారు. సేంద్రియ పంటలు వంటింటి వరకు వెళ్లాలని, శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వరి కంకులు, మట్టిపాత్రలు, భోగి పిడకలు, పచ్చడి బండలు, చెక్క వస్తువుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా లింగ భైరవి దివ్యపూజ


పూజలు చేస్తున్న వేద పండితులు

ఎంవీపీ కాలనీ: కోయంబత్తూర్‌లోని ఈషా యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో లింగ భైరవి అమ్మవారి దివ్యపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం అందరికీ కలగాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. విశాఖ వేదికగా మొదటిసారిగా ఈ పూజ చేశామన్నారు. కోయంబత్తూర్ ఆశ్రమం నుంచి వచ్చిన 18 మంది శివంగ సాధకులతో లింగ భైరవి దివ్యపూజ చేసి అనంతరం శివంగ స్ఫూర్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ర్యాంప్ వాక్


ర్యాంప్ వాక్ చేస్తున్న చిన్నారి

బీచ్ రోడ్డు: రకరకాల ఫ్యాన్సీ డ్రెస్‌లలో చిన్నారుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. ఆదివారం వీజేఆర్ కిడ్స్ టాలెంట్ షోను నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. మూడేళ్ల వయస్సు నుంచి 15 ఏళ్ల వయస్సు గల చిన్నారులు 200 మంది పాల్గొన్నారని నిర్వాహకురాలు కొత్తపల్లి జ్యోతి తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం యాక్ట్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని కార్పొరేటర్ స్వాతి ప్రారంభించారు. ఈ క్యాంప్ ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కాలనీలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్: నేవల్ సివిల్ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్(పులగాలిపాలెం) మేనేజింగ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రామారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా బి.తాతారావు, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా టి.శివరావు, కోశాధికారిగా ఎం.ప్రభాకరరావు, డైరెక్టర్లుగా ప్రసాద్, బీవీఎస్ అప్పారావు, కాంతారావు ఎన్నికయ్యారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం


సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు, లబ్ధిదారులు

ఎంవీపీ కాలనీ: ఈ నెల నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలుకు పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్ర పటానికి 17వ వార్డు మద్దివారి వీధిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు అవ్వా తాతలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధాప్య పెన్షన్‌ను రూ.3 వేలుకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. సామాజిక ప్రగతిపై, వృద్ధుల అభ్యున్నతిపై ముఖ్యమంత్రి జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలారెడ్డి, లక్ష్మణరెడ్డి, కుమార్, ప్రేమ్ కిరణ్, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు

శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు


శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు. రెటీనా, గ్లకోమా, కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య సేవలు అందించామన్నారు. 2023లో గ్లకోమా నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

'జనం కోసమే శాంతి ఆశ్రమం'


మాట్లాడుతున్న ఆదిత్య

బీచ్ రోడ్డు: జనం కోసమే శాంతి ఆశ్రమం నెలకొల్పామని ఆశ్రమ అధ్యక్షుడు ఎస్.ఆదిత్య తెలిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ భూములను ఆక్రమించుకోవడంపై సుప్రీంకోర్టులో కేసు వేయగా.. గత నెల 14న తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. వచ్చే సెప్టెంబరు నాటికి వారి ఆధీనంలో ఉన్న 6.54 ఎకరాలను అప్పగించాలంటూ తీర్పు ఇచ్చారన్నారు. శాంతి ఆశ్రమ ప్రాంగణంలో ప్రకృతి వైద్యాలయ ఆశ్రమం నిర్వహణకు అప్పట్లో ఓంకార్ స్వామీజీని కోరగా నిబంధనల మేరకు భూములిచ్చారన్నారు. ఆ లక్ష్యం నెరవేర్చకపోతే భూములను వెనక్కి ఇచ్చేయాలంటూ అప్పట్లో రాఘవేంద్రస్వామి అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. అయితే ఆయన వారసుడిగా చెప్పుకుంటున్న గాజుల వివేకానంద మాట తప్పారన్నారు. తమ భూములు తమకు అప్పగిస్తే శాంతి ఆశ్రమ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో లీగల్ అడ్వయిజర్ పీఎస్ఎన్ మూర్తి, సభ్యులు శ్రీనివాసరావు, నర్సింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిస్టరీ కాంగ్రెస్ సదస్సు


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. పురావస్తు శాఖ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ సోమశేఖర్‌రావు ముగింపు ఉపన్యాసమిచ్చారు.

బ్యాటరీ సైకిల్ ర్యాలీ

కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం 50 బ్యాటరీ సైకిళ్లతో బుల్లయ్య కాలేజీ నుంచి ఆర్కే బీచ్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన మధుకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని, నూతనాలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ


తయారు చేసిన వాల్ డెకరేటివ్స్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకీ సెంటర్‌లో స్టోరీ టైం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ట్రైనర్ రబియ నవాజ్ 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు కాగితంతో వాల్ డెకరేటివ్స్ తయారీ, 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నేమ్ ప్లేట్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల కోసం బహుమతులు రూపొందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలను ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో నిమగ్నం చేయడం వల్ల వారిలో స్కిల్స్, ఆలోచనా విధానం, ఊహాశక్తి మెరుగవుతాయని చెప్పారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దుర్గారాణి పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితులకు రిమాండ్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు సంయుక్తంగా దాడులు నిర్వహించగా తమిళనాడులోని మదురై ప్రాంతానికి చెందిన కాజా మైదీన్ ఇబ్రహీం, కర్నాటక బెంగుళూరుకు చెందిన మనీష్, చేతన్‌కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను ఊర్వశి జంక్షన్ వద్ద పట్టుకుని వారిని విచారించారు.

అరకు నుంచి గంజాయిని బెంగుళూరుకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జల్సాల కోసం..

విలాసాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలనే నెపంతో గుంటూరుకు చెందిన సింగు యోగేష్‌బాబు అనే యువకుడు తనకు కొత్తగా పరిచయమైన హనీష్ వర్మ అనే స్నేహితుడు ఇచ్చిన సలహా మేరకు గంజాయి విక్రయించాలనుకున్నాడు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అతడు గంజాయి తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా జ్ఞానాపురం ఫ్లై ఓవర్ వద్ద యోగేష్ బాబును పట్టుకుని విచారించారు. అరకులోని పరశురాం అనే వ్యక్తి వద్ద 6 కేజీల గంజాయి కొని గుంటూరు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అతడి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు మిగతా వ్యక్తుల కోసం కేసు దర్యాప్తు చేపట్టారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


బీచ్ రోడ్డు: బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ ఎస్. రమేష్ ఒక్కొక్క రౌడీషీటర్‌ను విడివిడిగా కౌన్సెలింగ్ చేశారు. వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని నడుచుకోవాలన్నారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్దకు పోలీసులు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన హాస్యనాటిక


ఏక్ దిన్‌కా సుల్తాన్ నాటికలో హాస్య ఘట్టం

మురళీనగర్: కళల ప్రోత్సాహంలో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం ప్రదర్శించిన హాస్యనాటిక అలరించింది. పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాత్రి 7 గంటలకు జంధ్యాల రచించిన ఏక్ దిన్‌కా సుల్తాన్ హాస్య నాటికను మాధవధారలోని శ్రీచైతన్య కళాసాగర్ నటులు ప్రదర్శించారు. దీనికి సనపల సన్యాసయ్య దర్శకత్వం, ఎల్‌వీ రమణ పర్యవేక్షణ చేశారు. ఎస్.సన్యాసయ్య, ఎస్.రామానుజయ్య, పి.గిరిధర్, ఎ.కొండలరావు, ఎస్.హరిబాబు, ఎస్.సత్యనారాయణ నటించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. సత్యనారాయణ మూర్తి సంగీతాన్ని అందించారు.

'ఉచిత ప్రయాణ పథకంతో ఆటో కార్మికుల ఉపాధికి గండి'


ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఆటో వర్కర్ల ఫెడరేషన్ నాయకుడు పడాల గోవింద్

మద్దిలపాలెం : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేస్తే ఆటో కార్మికుల ఉపాధికి గండి పడుతుందని, ఈ పథకంపై రాజకీయ పార్టీలు పునరాలోచన చేయాలని ఏపీ ఆటో కార్మికుల సంఘం నాయకుడు పడాల గోవింద్ కోరారు.. మద్దిలపాలెం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల హామీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం అమలు చేస్తామని పలు పార్టీలు ప్రకటించడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు అద్దూరి శంకర్, ఎస్.మధురెడ్డి, కృష్ణంనాయుడు, ఎస్.అప్పలనాయుడు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీకి సాహితీ సేవా పురస్కారం


డాక్టర్ బాబ్జీని సాహితీ సేవా పురస్కారంతో సత్కరిస్తున్న ఎస్.ఆర్.ఎస్.కొల్లూరి

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ రచయిత, కవి, సామాజిక వేత్త డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి సాహితీ సేవా పురస్కారం ప్రదానం చేశారు. రాజమండ్రిలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సభలో ఆయనకు పరిషత్ సంచాలకుడు ఎస్.ఆర్.ఎస్.కొల్లూరి ఈ పురస్కారం ప్రదానం చేసి, సత్కరించారు. ఈ నెల 5, 6, 7 తేదీలలో జరిగిన శ్రీరాజరాజ నరేంద్రుడు వారికి సహస్ర కవితా నీరాజనం కవి సమ్మేళనంలో, కథాపఠనంలో బాబ్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కవితా ప్రయాణం అనే కవిత, సమాజం నా ఊపిరి అనే కథాపఠనం చేసి ప్రశంసలు పొందారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, నగరానికి చెందిన నరవ ప్రకాశరావు, నేమలి త్రినాథరావు, చిన్నారావు, రఘుపాత్రుని రాధారాణి, వినీత, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థుల ధర్నా


హాస్టల్ ఎదుట ఖాళీ కంచాలు, వంట పాత్రలు పెట్టి ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో భోజనం, వసతి సౌకర్యాలు బాగాలేవని ఆదివారం రాత్రి విద్యార్థులు ధర్నాకు దిగారు. వసతి గృహం ఎదుట ఖాళీ కంచాలు, వంట పాత్రలు పెట్టి నినాదాలు చేశారు. వార్డెన్ వెంటనే బయటకు రావాలని, అధ్వానంగా ఉన్న మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. వార్డెన్ ఎప్పుడూ హాస్టల్‌లో అందుబాటులో ఉండటం లేదని ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోపించారు. ఇక్కడ సుమారు 100 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన భోజనం పెట్టడం లేదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే హాస్టల్‌ను సందర్శించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఉత్తరాంధ్ర కల్పవల్లికి విశేష పూజలు


విశేష పూజలందుకున్న కనకమహాలక్ష్మి


ఉషానాయుడు డాన్స్ అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్యం


దేవులపల్లి శ్రీదేవిచే అన్నమాచార్య కీర్తనలు

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 25వ రోజు కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల 500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవులపల్లి శ్రీదేవిచే నిర్వహించిన అన్నమాచార్య కీర్తనలు, తిరువూరుకు చెందిన గోదా నరసింహారావుచే ఏర్పాటు చేసిన భక్తిరంజని, టి. ఉషానాయుడు డాన్స్ అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

11న మహాన్నదాన కార్యక్రమం..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా చివరి గురువారం (ఈ నెల 11న) మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్‌కొత్తరోడ్డు, జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఈవో కె. శిరీష తెలిపారు.

ముకుంద రచనలతో సాహిత్యానికి పట్టాభిషేకం


ప్రతిభ పురస్కార గ్రహీత సభలో మాట్లాడుతున్న డాక్టర్ డి.వి.సూర్యారావు

మద్దిలపాలెం : ప్రపంచ సాహిత్యానికి యల్లపు ముకుంద రామారావు తన రచనలతో పట్టాభిషేకం చేశారని ప్రముఖ రచయిత, విమర్శకుడు డాక్టర్ డి.వి.సూర్యారావు అన్నారు. కళాభారతి ఆడిటోరియంలో అజో- విభో- కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ప్రతిభమూర్తి పురస్కార గ్రహీత యల్లపు ముకుంద రామారావు కృషి సమాలోచన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇజాలు, భావాల పట్ల పక్షపాతం లేదన్న విషయం అతని రచనలో కనిపిస్తుందన్నారు. సభాధ్యక్షుడు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వలస, వలస వేదనకు ఉన్న తేడాను వలస పోయిన మందహాసం కవిత్వం ద్వారా తెలిపారన్నారు. ప్రేమించడానికి తీరిక లేదు, ద్వేషించడానికి ఎక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు. అంతే కాంతి అంశంపై డాక్టర్ కె.ఎస్.మల్లేశ్వరి మాట్లాడుతూ ఆ కాలపు భక్త కవులలో తీవ్రమైన భక్తి ఉందని, దీనిపై ముకుంద రామారావు పరిశోధన చేశారన్నారు. కాకినాడకు చెందిన మాకినీడు సూర్య భాస్కర్ మాట్లాడుతూ ఎవరూ చేయని పనిని రామారావు తన సాహిత్యంలో చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో బి.వి.అప్పారావు, అప్పజోష్యుల సత్యనారాయణ, వి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.